

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

ఆదివారం | 29 | మార్చి | 2026 ◆ పేజీలు : 7


# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 28 (ప్రజాజ్యోతి) :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శనివారం జిల్లాలోని ఘనపూర్ స్టేషన్ మండల పరిధిలో గల జెడ్పీఎస్ఎస్, ఛాగల్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల

మిగతా 2 లో...



## సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులు
# వేగవంతంగా పూర్తి చేయాలి

- ఎంపిడిఓ కార్యాలయంలో నక్ష సర్వే పురోగతిని సమీక్షించిన కలెక్టర్

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వర్ధన్నపేట,మార్చి 28, ప్రజా జ్యోతి.** రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం మరియు యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న భూముల సరిహద్దులు, కొలతలు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మరియు మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు,

మిగతా 2 లో...

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

- డ్రైనేజీ పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ సునీల్, కమిషనర్ అంజయ్య..



**పరకాల, మార్చి 28, (ప్రజాజ్యోతి):** పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి చొరవతో టి యు ఎఫ్ ఐ డి సి ద్వారా మంజూరైనా నిధులతో 12,15,21,22వ వార్డులో ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా,పిట్ట వాడ,నటరాజ్ టాకీస్ రోడ్డు,జయ డీలక్స్ రోడ్ ఏరియాలో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యతలో రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. వారితో పాటు పట్టణ అధ్యక్షులు 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యాడ శ్రీనివాస్ తో పాటుగా స్థానిక కౌన్సిలర్లు సుధమల్ల రమేష్,అల్లె దశరథం,బండి శ్రీధర్, కుక్కల విజయ్, కాంగ్రెస్ నాయకులు పొరండ్ల వేణు, గొడుగు నాగరాజు,ఆకుల శ్రీధర్ మున్సిపల్ ఏఈ రోహిత్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఖురేషి,సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల ఎండు గంజాయి స్వాధీనం


- ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**రాయపర్తి మార్చి 28 ప్రజాజ్యోతి** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో శనివారం అక్రమంగా ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్ గిరి జిల్లా నుండి తెలంగాణ రాష్ట్రంలోని వరంగలు జిల్లాకు కారులో తరలిస్తున్న విక్రమ్ మండల్, గౌతమ్ మండల్, బిప్రోజిత్ లు 20 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ముత్యం రాజేందర్ పోలీసులు మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టి వారినీ అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రెవెన్యూ సమస్యలను
# వేగవంతంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ కలెక్టరేట్ మార్చి 28 (ప్రజాజ్యోతి):** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా ఫైళ్లు, ఇతర రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు, ముఖ్యంగా సాదా బైనామా సంబంధిత ఫైళ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, పెండింగ్‌లో

మిగతా 2 లో...

## సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)


మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఆయా భూములకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నక్ష సర్వేను సమర్ధవంతంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకులలో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగతా బ్లాకుల్లో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహణ సరళిని పరిశీలించారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరం వంటి వాటి గురించి ఆరా తీశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్ష పూర్తైన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి



(మొదటి పేజీ తరువాయి...)

ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమయానుకూలంగా సేవలు అందించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవోలు వరంగల్ సుమ, నర్సంపేట ఉమారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య నివారణకు చర్యలు – సర్పంచ్ రేణుక



**ధర్మసాగర్, మార్చి 28 (ప్రజాజ్యోతి) :** గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ముప్పారం గ్రామ సర్పంచ్ గుంటి పల్లి రేణుక తెలిపారు. గ్రామంలో ఉన్న చేతి పంపులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రేణుక అధ్యక్షతన నిర్వహించిన పాలకమండలి సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్మశానవాటికను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అలాగే గ్రామంలో డ్రైనేజీలపై రాంపులు, పైకప్పులు ఏర్పాటు చేయడం, కోతులు మరియు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని తీర్మానించారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఉన్న 14 బోర్లలో ప్రస్తుతం 8 చేతిపంపులు మాత్రమే పనిచేస్తున్న నేపథ్యంలో మిగిలిన పంపులను తక్షణమే మరమ్మత్తు చేసి అన్ని కాలనీలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి గౌడ్, మండల పంచాయతీ అధికారి అబ్జల్, గ్రామ కార్యదర్శి ఆకార సురేష్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నేటి యువతరానికి...! ఆయనే "ఆదర్శం"

- ఆదర్శంగా నిలుస్తున్న మాట్ల వెంకటేశ్వర్లు..!
- ఉపాధ్యాయుడిగా, రాజకీయ నాయకుడిగా ప్రజాసేవ..!
- గ్రామంలో ఎవరు మరణించిన 50 కిలోల బియ్యం వితరణ
- ప్రజాసేవ ధ్యేయం ప్రజల కోసమే నా ప్రయాణం
- అంటూ.. నేటి యువతకు దిశా నిర్దేశం చూపుతున్న వ్యక్తి.. మాట్ల వెంకటేశ్వర్లు..!



**కమలాపూర్ మార్చి 28 ప్రజా జ్యోతి న్యూస్** నేటి సమాజంలో రాజకీయాల్లోకి రాణించి ఎంత సంపాదిస్తావు అంటే..?మనవడు ముని మనవలు సైతం కూర్చొని తినేలా సంపాదిస్తానని ఆలోచించే రోజుల్లో..! పేద ప్రజల కోసం నమ్ముకున్న వ్యక్తుల కోసం అహర్నిశలు కష్టపడి చిన్నప్పటినుండి అభ్యుదయ భావాలు,ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే నైజం ఈ నేతకే సాధ్యమైంది. కష్టాల్లో ఉన్నానని ఏ ఇంటి మనిషి,తన ఇంటి తలుపు తట్టిన.. కాదనకుండా సహాయాన్ని అందించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ విశ్రాంత ఉపాధ్యాయుడు. రాజకీయాల్లో ప్రజాసేవలో తనదైన శైలిలో ప్రజలకు సేవనందిస్తూ నేటి యువతరానికి రాజకీయ ఓనమాలు నేర్పుతున్నారు ఈ కురువృద్ధుడు ...

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన మాట్ల వెంకటేశ్వర్లు వ్యాయామ ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొని 40 సంవత్సరాలు మండలంలోని వందలాది మంది పిల్లలకు క్రీడలను నేర్పిస్తూ తనదైన శైలిలో జాతీయస్థాయిలో రాణించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దారు. తన భావాజాలం, సమయస్ఫూర్తి పిల్లలకి చక్కటి రీతిలో ఆటలు ఎలా ఆడాలో మెలుకువలు నేర్పి వందల మంది విద్యార్థులు నేడు ప్రభుత్వ కొలువులు,ప్రైవేటు కంపెనీలో కీలకమైన పదవులను, అధికారాలను అనుభవించేల విద్యార్థులను తయారుచేసిన అనుభవం ఈ ఉపాధ్యాయుడికి సొంతమైంది. విశ్రాంత ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగం అయిపోయిన ఇక జీవితం విశ్రాంతంగా జీవించాల్సి ఉంటే తన వయసును పక్కనపెట్టి ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం తన గొంతు నినదించాలని ప్రజలకు తన సహాయ సహకారాలు అందించాలని లక్ష్యంతో ప్రజా క్షేత్రంలోకి అడుగెట్టి వార్డు సభ్యులుగా, ఎంపీటీసీగా గెలుపొంది ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రజలే తన బలమని నమ్మి ప్రతి ఇంటికి తోచిన సహాయాన్ని అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో ఎవరు మరణించిన తన సొంత ఖర్చులతో 50 కిలోల బియ్యాన్ని, నిరుపేద కుటుంబాలైతే ఆర్థిక సహాయాన్ని సైతం అందిస్తూ నేటి యువతరానికి దిక్సూచిగా మారారు. నేటి సమాజంలో రాజకీయాలు భ్రష్టుపట్టే పరిస్థితులు ఉంటే ఇలాంటి నేతల వల్ల ఎంతో కొంత రాజకీయ సిద్ధాంతాలు, సమాజ సేవకు పని చేసే నేతలు ఇంకా బ్రతికే ఉన్నారని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఇలాంటి వారి స్ఫూర్తిని నేటి యువతరం స్వీకరించి ప్రజా సమస్యలే దయంగా ప్రజలే బలంగా ముందుకు సాగి సమాజ స్థాపనకు నడుం బిగించాలని పలువురు విశ్లేషిస్తున్నారు.





## మహిళా సాధికారత సాధించడమే సర్వోదయ సంస్థ లక్ష్యం

- - డా.పల్లెపాడు దామోదర్




**ఆ త్మకూరు, మార్చి 28 (ప్రజా జ్యోతి):** మహిళా సాధికారత సాధించడమే సర్వోదయ సంస్థ లక్ష్యమని, అందు కోసం సర్వోదయ సంస్థ గ్రామాలలో అన్ని స్థాయిలలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శనివారం ఉదయం ఆత్మకూరు మండల కేంద్రం లోని ముదిరాజ్ భవనం లో సర్వో దయ యూత్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన అంగన్వాడీ టీచర్లకు మహిళా రక్షణ చట్టాలు, సహకరించే వ్యవస్థలు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 10మండలాలలో మహిళల ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత అభివృద్ధి పెంపొందించడం కోసం పని చేస్తోందని, మహిళల కోసం పనిచేస్తున్న సంస్థలను కూడా సమన్వయం చేస్తోంది అని తెలిపారు. 4000 మంది ఒంటరి మహిళలకు మరియు చిన్న వయస్సు లోనే రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలలోని మహిళలకు ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు పెంచామని, మహిళలు వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోడానికి గ్రామాలలోనే కుట్టు మరియు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 15000 మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామని తెలిపారు. సమాజంలో సగ భాగమైన మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్న లింగ వివక్ష కు గురి అవుతున్నారని, పురుష ఆధిక్యత గల సమాజంలో మహిళలకు, బాలికలకు లింగ వివక్షత తో కూడిన ఆచార కట్టుబాట్లతో అనేక రకాల హింసకు గురి అవుతున్నారని అన్నారు.



సర్వోదయ సంస్థ గత 15 సంవత్సరాలనుండి హింసకు, వివక్షకు గురి అయిన మహిళలకు మహిళా సహాయక కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్, అవసరమైన సహాయ, సహకారాలు అందించి, సుమారు 27000 ల కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా వివిధ రకాల సేవల ద్వారా బాధిత మహిళలకు అండగా నిలిచిందని అన్నారు. సర్వోదయ సంస్థ హన్మకొండ మరియు వరంగల్ జిల్లాలో సఖి వన్, స్టాప్ కేంద్రాలను 24 గంటలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. మహిళా సాధికారత కు మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచితంగా వృత్తినైపుణ్య శిక్షణలు టైలరింగ్ మరియు కంప్యూటర్స్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించిందని అన్నారు. ఒంటరి మహిళలు, వితంతువుల జీవన ఉపాధి మెరుగు పరచడానికి వడ్డీ లేని రుణాలను అందించి సూక్ష్మ మరియు పరిశ్రమలు ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి కృషి చేసిందని అన్నారు. కుటుంబం లో మహిళ పాత్ర ప్రధాన మైనదాని, ఆమె సంక్షేమమే కుటుంబ అభివృద్ధికి కారణం అని అన్నారు. మహిళ సంరక్షణ మరియు రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ముఖ్యంగా సఖి వన్ స్టాప్ సెంటర్, జిల్లా మహిళా సాధికరతా కేంద్రం, స్వధార్ హోమ్స్ పని చేస్తున్నాయని, సమస్యలలో ఉన్న మహిళలు 100, 181 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ నసీమా మాట్లాడుతూ.. మహిళా రక్షణ కోసం చట్టాలు ఉపయోగపడతాయని, ప్రతి సమస్యకు చట్టంతో పరిష్కారం దొరుకుతుందని అన్నారు. హక్కులు సాధించు కోవడానికి చట్టాలు దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర మండలాల నుంచి అంగన్వాడీ టీచర్స్, సర్వోదయ సంస్థ సభ్యులు ఇందిర, రవీందర్, పరకాల ఐసిడిఎస్ సూపర్వైజర్స్ నసీమ, మంజుల, అంగన్వాడీ టీచర్లు, ఆత్మకూరు మహిళా సహాయత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి సర్పంచ్ సంకల్పం...
# పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ..!

- పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన సర్పంచ్ మెరుగు హేమలత-వీరేశం దంపతులు





**సంగెం,మార్చి28(ప్రజాజ్యోతి):** మండలంలోని నల్లబెల్లి గ్రామంలో శనివారం పోచమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ మెరుగు హేమలత–వీరేశం గౌడ్ ఘనంగా భూమి పూజ నిర్వహించారు.గ్రామస్తులందరి సహకారంతో,వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసి ఆలయ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మెరుగు హేమలత వీరేశం మాట్లాడుతూ..నల్లబెల్లి గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని,గ్రామం సుభిక్షంగా,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ఈ ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందని, భక్తులకు అన్ని సౌకర్యాలు ఉండేలా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.త్వరలోనే ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ వెల్లడించారు.

## సైనిక్ స్కూల్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి



**మహాముత్తారం, మార్చి 28. ప్రజాజ్యోతి** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన కట్ల శ్రీశ్వంత్ ఇటీవల విడుదలైన సైనిక్ స్కూల్ ఫలితాల్లో సత్తా చాటాడు. మండల కేంద్రానికి చెందిన కట్ల స్వప్న–రమేష్ దంపతుల కుమారుడు శ్రీశ్వంత్ మహాముత్తారం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. 6వ తరగతి ప్రవేశాల కొరకు రాసిన ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ సమీపన గల నేతాజీ సైనిక్ స్కూల్లో సీటు సాధించడం హర్షించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు చేరి ప్రభాకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాలు, సైనిక్ స్కూల్ ఫలితాలే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధనకు నిదర్శనమని పేర్కొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచి సీటు సాధించిన విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ పంపిణి



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 28)**మండలకేంద్రంలోని జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కాలిన్సీ ఎరోస్పేస్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు రామారావు, విశాల్ లు 190 మంది విద్యార్థులకు బ్యాగులు,నోట్ బుక్కులు, పెన్నులు ,పెన్సిళ్లు ఇతర స్టేషనరీని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధిలు,మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు చదువులో రాణించుటకై మా సంస్థ తరఫున ప్రతి సంవత్సరము విద్యాభివృద్ధి కోసం సహాయం చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం కావలసిన వసతులను సమకూర్చడంలో మా సంస్థ ముందుంటుందని ఏదైనా సదుపాయాలు అవసరం ఉంటే మాకు సమాచారం అందిస్తే వెంటనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ కాలిన్సీ ఎరోస్పెస్ సంస్థ వారు అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశించారు.ఫిజికల్ డైరెక్టర్ రాజయ్య మాట్లాడుతూ గత సంవత్సరము పాఠశాలకు అందించిన స్పోర్ట్స్ మెటీరియల్ ద్వారా పలువురు విద్యార్థులను జాతీయ స్థాయిలో రాష్ట్రస్థాయిలో క్రీడాకారులుగా రాణించుటకు ఉపయోగపడిందని కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్,రాజు, ప్రవీణ్ ,విజయభాస్కర్, కళ్యాణి, పద్మ, రాజయ్య, లలిత,చందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్త్ అవర్ కార్యక్రమం



**పర్వతగిరి మార్చి 28 (ప్రజాజ్యోతి )**మండల కేంద్రంలోని ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు సెంటర్ మరియు ఎస్టీ బాలుర వసతి గృహంలో ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మార్చి నాలుగవ శనివారం రాత్రి 8:30నుంచి 9:30వరకు లైట్లు ఆఫ్ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిదురు శంకర్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నారం షరీఫ్ తైబజార్ వేలం మూడో సారి వాయిదా

**పర్వతగిరి, మార్చి 28 (ప్రజాజ్యోతి )**పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ అధ్యక్షతన 2026–27 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ బహిరంగ వేలం మూడోసారి నిర్వహించారు. అయితే వేలం ప్రక్రియలో సరియైన అప్సెట్ ధర రాకపోవడంతో వేలాన్ని మళ్లీ వాయిదా వేసినట్లు ఎంపిఓ శేషు తెలిపారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి, తదుపరి చర్యల కోసం పై అధికారుల కు నివేదిక పంపినట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోబడతాయని సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, పంచాయతీ కార్యదర్శి వెల్లడించారు.

## మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం

- ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం
- మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్





**నర్సంపేట మార్చి 28 (ప్రజాజ్యోతి )** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మాదన్నపేటలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్తకొండ మే ఘన శ్యామ్ రాజ్.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభు త్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, ఇందిరమ్మ ఇండ్లు,ఉచిత బస్సు సౌకర్యం,వడ్డీ లేని రుణాలు వంటి పథకాలతో పాటు ఇంద్రమ్మ చీరల పంపిణీతో మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. శాసనసభ్యు లు దొంతి మాధవరెడ్డి రెడ్డి సహకారంతో అవసరం ఉన్న చోట మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామని వారు అన్నారు.నర్సంపేట పట్టణంలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరను పంపిణీ చేస్తామని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ ని సన్మానించిన స్వయం సహాయక సంఘ సభ్యులు 1వ వార్డు మహిళలు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ బాణాల ప్రసన్న శ్రీనివాస్,పొన్నాల మనీషా ప్రకాష్,వేల్పుల శ్రీలత,సి ఏ దుడేల శ్రీను,బండి స్వరూప, వి ఓ అధ్యక్షురాలు అలం అరుణ,ములుగూరి మమతా,మున్సిపల్ అధికారులు,స్వయం సహాయక సంఘ సభ్యులు,1వ వార్డు మహిళలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత మెగా వైద్య శిబిరం





**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 28)**మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైనట్లు వైద్యాధికారిణి నాగరాణి, నవత తెలిపారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదేశాల మేరకు వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి జిల్లా ఆసుపత్రి నుండి వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, స్త్రీ వ్యాధి నిపుణులు (గైనకాలజీ), పిల్లల వైద్య (పీడియాట్రిక్), దంత వైద్యులు, కంటి వైద్యులు హాజరై సేవలు అందించారన్నారు.ఈ శిబిరనికి మండల పరిధిలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారని 168 మంది రోగులకు వైద్యం అందించామన్నారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, దంత వ్యాధులు, కంటి సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందించగా అవసరమైన 23 మంది రోగులను జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయడం జరిగిందన్నారు.వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలోఆయుష్ మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్రరావు,సి హెచ్ ఓ రాజేంద్ర ప్రసాద్,హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి,స్టాఫ్ నర్స్ సరిత, కల్పన,ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ,ఏ ఎన్ ఎం సిబ్బంది,సూపర్వైజర్ సునీత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


## శుభకార్యాలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఏటూర్ నాగారం మార్చి 28 ప్రజా జ్యోతి** మండలంలోని రొయ్యూరు గ్రామం లో జరిగిన శారీ ఫంక్షన్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు , ఆర్ టి ఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల యూత్ నాయకులు దుర్గం ప్రభాకర్ కూతురు పుట్టిన రోజుకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఏటూరు నాగారం మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు , ఆర్ టి ఏ.డైరెక్టర్ వసంత శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధు,మండల నాయకులు గంపల శివకుమార్,గ్రామ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నియంత్రణ లేని వీధిలైట్లు..!

- **పట్టపగలు వెలుగుతున్నా.. పట్టనట్లు ఉంటున్న పాలకులు, అధికారులు !**



**ఖానాపురం /మార్చి 28(ప్రజా జ్యోతి)** ఖానాపురం మండలంలోని పలు గ్రామాలలో వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. గ్రామాలలో వీధి దీపాలకు ఆయా పంచాయతీలు నియంత్రణ కోసం స్విచ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, పాలకులు, అధికారులు తమకు పట్టనట్లు ఉండడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహజంగా వేసవికాలం విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో పట్టపగలు వీధి లైట్లు వెలుగుతుండటంతో విద్యుత్ వృధా అవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నియంత్రణ లేని వీధిపాలను పట్టపగలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేత్రపర్వంగా పట్టాభి రాముని గ్రామోత్సవం

- **మహిళల కోలాటాల మధ్య కొనసాగిన ఊరేగింపు**
- **మంగళహారతులతో స్వాగతం పలికిన భక్తులు**



**గణపురం ప్రజాజ్యోతి మార్చి 28** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం కల్యాణ వేడుక అనంతరం శనివారం సాయంత్రం పట్టాభి సీతారాముల గ్రామోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు ప్రారంభమైంది. మండల కేంద్రంలోని పురవీధుల గుండా గ్రామోత్సవం కొనసాగగా మహిళలు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. మహిళల కోలాటాల తో ఉత్సాహంగా ఊరేగింపు కొనసాగింది. పూజా కార్యక్రమాలను వేద పండితులు ఆలయ అర్చకులు గోవర్ధన దుర్వాస చార్యులు శ్రీనివాసచార్యులు, సముద్రాల సంపత్ చార్యులు నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జంగిలి శ్రీనివాసరావు, గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్ మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ నాయకులు మతి భ్రమించి అవాస్తవాలు మాట్లాడటం మానుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు




**ఏటూర్ నాగారం, మార్చి 27 ప్రజాజ్యోతి** బిఆర్ ఎస్ నాయకులు మతి భ్రమించి అవాస్తవాలు మాట్లాడటం మానుకోవాలినీ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాజీ రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డిపై ఏటూర్ నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిట మట రఘు ఆగ్రహం వ్యక్తం చేశారు "మతి భ్రమించి అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలి" అంటూ ఘాటు విమర్శలు చేశారు. 251 కోట్ల తో మేడారాన్ని గుడి ప్రాంగణాన్ని రోడ్లను కల్వర్ట్స్ జంపన్న వాగు స్థానల ఘట్టం ఇతర ఆర్డబ్ల్యూఎస్ వివిధ పనుల నిమిత్తము మంజూరు చేయబడినవి. గుడి ప్రాంగణం రాతి కట్టడాలకు 100 కోట్లు మంజూరు చేయబడినవి. అన్నారు. ఇందులో 80% పనులు అయిపోయినవి ఇంకా 20% పనులు నడుస్తున్నవి. అన్నారు మేడారం గుడి ప్రాంగణ నిర్మాణంపై సతీష్ రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు "100 కోట్లతో చేసిన పనులను 200 కోట్ల స్కాం అంటావా? దానికి ఆధారాలు ఏమిటి?" అంటూ నేరుగా ప్రశ్నించారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "హైదరాబాద్ అద్దాల మేడలో కూర్చొని అప్పుడప్పుడు ములుగుకు వచ్చి ప్రకటనలు ఇవ్వడం ఎందుకు? నువ్వు ములుగు జిల్లాకు చేసిన సేవలేమిటి చెప్పు" అంటూ సతీష్ రెడ్డి కి సవాల్ చేశారు. దేవగిరిపట్నం వాసుడిని అని చెప్పుకునే ఆయన, ములుగు జిల్లా అభివృద్ధికి ఎప్పుడైనా తోడ్పడ్డాడా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పదవి కోసం నాయకుల దగ్గర చేరి అవకాశాలు పొందారని, కానీ జిల్లాకు మాత్రం ఎలాంటి సేవ చేయలేదని ఆరోపించారు. "నాలుగు నెలలకొకసారి వచ్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడి వెళ్లిపోవడం రాజకీయాలా?" అంటూ ఎద్దేవా చేశారు. మేడారం జాతర సమయంలో సమ్మక్క–సారలమ్మ తల్లుల గద్దెల వద్ద ప్రతిష్టాత్మకంగా గుడి ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసిన ఘనత మంత్రి సీతక్కదేనని పేర్కొన్నారు. ఆమె కీర్తిని ఓర్చుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జాతర సమయంలో కోట్లాది మంది భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకున్నారని, ఎక్కడా ప్రమాదాలు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం భక్తుల సౌకర్యం కోసం మిగిలిన పనులను పూర్తి చేస్తున్న సమయంలో జరిగిన బాలుడి ప్రమాదాన్ని రాజకీయంగా వాడుకోవడం దారుణమని విమర్శించారు. బాలుడికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, అవసరమైన చికిత్సను కల్పిస్తూ కుటుంబాన్ని ఆదుకుంటామని స్పష్టం చేశారు. బాధలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చాల్సిన సమయంలో రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. "సమ్మక్క–సారలమ్మ దేవతల గౌరవాన్ని రాజకీయాల్లోకి లాగొద్దు. సీతక్క ఆ దేవతలను ప్రాణం కంటే ఎక్కువగా భావించే నాయకురాలు" అని పేర్కొన్నారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడేది మీరేనని, దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టే అని విమర్శించారు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సీతక్క పై విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. "నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ములుగుకు రా... లేకపోతే అబద్ధాల రాజకీయాలు మానుకో" అంటూ ఘాటుగా స్పందించారు., "ములుగు ప్రజలు అన్నీ గమనిస్తున్నారు... ఇప్పటికైనా నీ వైఖరి మార్చుకో. ఆదివాసీ బిడ్డ జోలికి వస్తే ఊరుకునేది లేదు"" అంటూ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భూమి హాంఫట్

- **భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి**
- **ఐటిడిఏ పీఓకు తుడుం దెబ్బ జాతీయ కమిటీ వినతి పత్రం**
- **అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తున్న రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలి.**
- **తుడుం దెబ్బ జాతీయ నాయకులు పొడేం బాబు**








**ఏటూర్ నాగారం, మార్చి 28, ప్రజా జ్యోతి** ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తూ కోట్ల రూపాయల విలువైన భూములను కబ్జా చేస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని "ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ" జాతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంస్థ జాతీయ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పొడేం బాబు ఐటిడిఏ కార్యాలయం ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీఓ)కు శనివారం వినతి పత్రం అందజేశారు. అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తున్న రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలి. తుడుం దెబ్బ జాతీయ నాయకులు పొడేం బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటూర్ నాగారం మండల కేంద్రం లోని సర్వే నంబర్ 222లో సుమారు 15 గుంటల ప్రభుత్వ భూమిని కొంత మంది అక్రమంగా ఆక్రమించి, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చి విక్రయాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డుల్లో ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం లేదా సహకారంతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావాలని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, సంబంధిత అధికారుల పాత్రపై కూడా విచారణ చేపట్టాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని, లేదంటే ఉద్యమాలు చేపడతామని తుడుం దెబ్బ జాతీయ కమిటీ నాయకులు హెచ్చరించారూ. ఈ క్రమంలో నాయకులు వంక నరేష్ తదితరులు పాల్గొన్నారు

# మహిళల భద్రత – ప్రతి కార్యాలయ బాధ్యత

- POSH చట్టంపై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ కలెక్టరేట్ మార్చి 28 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో POSH Act–2013 పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై మాట్లాడుతూ, పని స్థలాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవ ప్రదమైన వాతావరణం కల్పించడం ప్రతి కార్యాలయ బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళా ఉద్యోగులు నిర్భయంగా తమ విధులను నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపులను నిరోధించేందుకు రూపొందించిన పోష్ చట్టం (POSH Act–2013) అమలును ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థ కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పోష్ చట్టానికి సంబంధించిన






వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. "సురక్షితమైన కార్యాలయం – సౌకర్యవంతమైన పని ప్రదేశం" అనే భావనతో రూపొందించిన ఈ పోస్టర్ ద్వారా ఉద్యోగుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధి సుధాకర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా POSH చట్టంపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యాలయాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, ఫిర్యాదు విధానం, విచారణ ప్రక్రియ, చట్టపరమైన రక్షణలు వంటి అంశాలను వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదు కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, తక్కువ సిబ్బంది ఉన్న సంస్థల్లో లోకల్ కంప్లైంట్స్ కమిటీ ద్వారా ఫిర్యాదులు స్వీకరించబడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించడమే కాకుండా విచారణ సమయంలో గోప్యతను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. తప్పు నిర్ధారణ అయిన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధిత మహిళలకు అవసరమైన రక్షణ చర్యలు కల్పించడం కూడా సంబంధిత అధికారుల బాధ్యత అని తెలిపారు. ఇంకా జిల్లాలోని అన్ని శాఖల్లో POSH కమిటీలు ఏర్పాటు చేయడం, కార్యాలయాల్లో చట్టానికి సంబంధించిన మార్గ దర్శకాలు ప్రదర్శించడం, మహిళా ఉద్యోగులకు తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం, లీగల్ సర్వీసెస్ అథారిటీ తో సమన్వయం పెంపొందించడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ అండ్ లోకల్ బాడీస్) జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, డీఎల్ఎస్ఏ అడ్వకేట్ సురేష్ మరియు ఇతర సంబంధిత జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల రైల్వే పాసులను మంజూరులో గందరగోళం

- పరిష్కారం చూపాలని కలెక్టర్ గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేత

**వరంగల్ సిటీ, మార్చి 28(ప్రజాజ్యోతి):** జిల్లాలో రాయితీ రైల్వే కోసుల మంజూరులో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ లో నవ తెలంగాణ వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ గతంలో దివ్యాంగులకు ట్రైన్ రాయితీ పాసులు వరంగల్ ఎంజీఎం హాస్పటల్ లో ఇచ్చేవారు. కానీ అక్కడున్న సిబ్బంది ట్రైన్ రాయితీ పాసులు ఇచ్చుటలో కొన్ని అవకతవకలు చేశారని వరంగల్ రైల్వే స్టేషన్ ముఖ్య అధికారి ఇట్టి దివ్యాంగుల ట్రైన్ రాయితీ పాసులు చెల్లెవు అని వాటిని అనుమతించ లేదు. ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి ఇట్టి ట్రైన్ రాయితీ పాసులను జిల్లా సంక్షేమ అధికారి ఆఫీసులో తీసుకొని ఎంజీఎంలో ఆర్ ఎం ఓ లతో సంతకాలు చేయించి ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దీంతో కలెక్టర్ చెప్పినట్లుగా జిల్లా సంక్షేమ అధికారి ఆఫీస్ వారు రెండు





నెలలు పాసులు ఇవ్వడం జరిగింది. తర్వాత ఎంజీఎం లో ఆర్ ఎం ఓ సంతకాలు చేయడం లేదని తీసుకోవడం లేదు. ఎలా తీసుకోవాలని అడుగుతే దివ్యాంగులే నేరుగా ఆర్ ఎం ఓ ల దగ్గరకు స్వయంగా వెళ్లి సంతకాలు చేయించుకోవాలని చెబుతున్నారు. 60 శాతం పైన వికలాంగత్వం ఉన్న దివ్యాంగులు ఫస్ట్ ఫ్లోర్ లో ఉన్న ఆర్ ఎం ఓ ల దగ్గరకు ఎలా వెళ్లగలుగుతారు. ఒకవేళ వెళ్లిన సరైన సమయానికి వారు ఉండరు. ఉన్నా కూడా వారు పెట్టడం లేదు. కనీసము ఇన్ వార్డ్ లో కూడా తీసుకోవడం లేదు. కావున దివ్యాంగుల ట్రైన్ రాయితీ పాసుల గూర్చి మరోసారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించి దివ్యాంగుల ట్రైన్ రాయితీ పాసులను జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్న డాక్టర్లకు దివ్యాంగులకు ట్రైన్ రాయితీ పాసులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఓ కి తెలపడం జరిగింది. కానీ ఇట్టి విషయంలో డిఎం అండ్ హెచ్ఓ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎవరు పట్టించుకోవడం లేదు. దీనితో జిల్లాలోని దివ్యాంగులు ట్రైన్ రాయితీ పాసులు ఎక్కడ, ఎలా తీసుకోవాలో తెలియక చాలా ఇబ్బందులు పడుతున్నారు. మాన్యువల్ దివ్యాంగుల ట్రైన్ రాయితీ పాసు లేనిది ఆన్లైన్ ట్రైన్ రాయితీ పాస్ రాదు. కావున ఈ విషయంలో వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల వేణుగోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బండారి మహేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గై సతీష్, ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, ఉపాధ్యక్షులు వేల్పుల ప్రభాకర్, కార్యదర్శులు ఎండి సాదిక్, కుమ్మరి శారద, మిట్టపల్లి శివాజీ మొదలగు వారు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక



**వరంగల్ సిటీ, మార్చి 28(ప్రజాజ్యోతి):** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, వరంగల్ ఈస్ట్ నందు శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నివేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు అభివృద్ధి కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి పి. అపర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డా. వి. రాధిక కాలేజి విద్యార్థులు సాధించిన విజయాలు మరియు అధ్యాపకులు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలపై సమగ్ర నివేదికను అందించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం. నందిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించింది. జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లను మరియు నిర్మాణ్ సంస్థ నిర్వహించిన ప్లేస్ మెంట్ డ్రైవ్ లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా అపాయింట్ మెంట్ లెటర్స్ అందజేసి విద్యార్థుల ప్రతిభని అధ్యాపకుల కృషిని ప్రిన్సిపల్ మార్గదర్శకత్వాన్ని ప్రశంసిస్తూ విద్యార్థులకు అనేక సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# ఘనంగా లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ వార్షిక దినోత్సవం

- - పాల్గొన్న ములుగు మున్సిపల్ చైర్మన్ చింతనిప్పల చంద్రకళ బిక్షపతి





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో చిన్నపిల్లల వార్షికోత్సవ కార్యక్రమం శనివారం నిజంగా హృదయాన్ని హత్తుకునేలా ప్రేరణనిచ్చేలా జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపల్ చైర్మన్ చంద్రకళ బిక్షపతి చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ భావోద్వేగ భరితమైన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మూడు నాలుగు ఏళ్ళలోనే చిన్నారులు చూపించిన క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, వేదికపై వారి ధైర్యం మనందరికీ ఒక గొప్పపాఠం. చిన్నవయస్సులోవారు ఇచ్చిన సందేశాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. వారి ప్రతి అడుగు, ప్రతిఅభినయం భవిష్యత్తులో వారు గొప్ప పౌరులుగా ఎదగబోతున్నారని సూచిస్తోందని, ఈ విజయానికి వెనుక ఉన్న ఉపాధ్యాయుల కృషి అమోఘమని, వారు పిల్లలలో ఉన్న ప్రతిభను వెలికితీసి, సరైన దిశలో నడిపిస్తున్నారని అభినందించారు. అదే విధంగా పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమని, ప్రేమతో పాటు విలువలను, క్రమశిక్షణను, నైతికతను నేర్పించడం ప్రతి తల్లి, తండ్రి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ చిన్నారులలోనే రేపటి భారతదేశం ఉందని, వారిని ప్రోత్సహించడం అంటే మన భవిష్యత్తును బలపరచడం అని అన్నారు. పిల్లలకలలను గౌరవిస్తూ వారికి మంచి విద్య తోపాటు మంచి సంస్కారం అందిస్తే వారు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షాల్మా, సిస్టర్ రిజి చాకొ, చర్చ్ ఫాదర్ మహిపాల్ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు సముద్రాల మధుసూదనాచారి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి ఉద్యమ కారుల అత్యవసర సమావేశాన్ని జయప్రదం చేయండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):**ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నేడు ఏర్పాటు చేయనున్న అత్యవసర సమావేశాన్ని ములుగు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఉద్యమకారులు జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఇప్పటి వరకు నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని అన్నారు.రాష్ట్రంలో,జిల్లాలో ఏర్పడ్డ కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఈ సమావేశానికి అతిథులుగా రాష్ట్ర,ఉమ్మడి జిల్లా నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని జిల్లా కమిటీ బాధ్యులు,ముఖ్య నాయకులు,మండల అధ్యక్ష కార్యదర్శులు,గ్రామ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సీనియర్ ఉద్యమకారులు విధిగా హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## పీహెచ్‌సీలో పారిశుధ్య పనులు..కలెక్టర్ ఆదేశాలతో వేగంగా చర్యలు





**చెన్నారావుపేట మార్చి 28 (ప్రజా జ్యోతి)**మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు మారుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో గ్రామ పంచాయతీ సిబ్బంది విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టారు.గత మార్చి 26న జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన విషయం తెలిసిందే.ఆ సమయంలో హాస్పిటల్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, అపరిశుభ్ర వాతావరణంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.రెండు రోజుల్లోగా పిచ్చి మొక్కలను తొలగించి,ఆవరణను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే హాస్పిటల్ లోపల పేరుకుపోయిన ఖాళీ డబ్బాలను తొలగించి, ప్రాంగణమంతా శానిటైజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కలెక్టర్ ఆదేశాలను సీరియస్‌గా తీసుకున్న అధికారులు, శనివారం ఉదయాన్నే గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు ప్రారంభించారు.ఆసుపత్రి ఆవరణలో అడ్డదిడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.వార్డుల్లోను స్టోర్ రూముల్లో ఉన్న అనవసరమైన ఖాళీ డబ్బాలను వ్యర్థాలను బయటకు పంపేశారు. అనంతరం ఆసుపత్రి లోపల బయట క్రిమిసంహారక మందులతో శానిటైజ్ చేయించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన సేవలందించడంతో పాటు ఆసుపత్రి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారిశుధ్యం విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కంది కృష్ణ చైతన్య రెడ్డి,గ్రామ పంచాయతీ సిబ్బంది,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు వర్సెస్ గ్రామస్తులు: జల్లి గ్రామంలో అట్రాసిటీ సెగ!

- చట్టం అధికార పార్టీకి చుట్టమైందా..? లేక రాజకీయ కక్షసాధింపా?
- తెరపై లేని వ్యక్తిపై కేసు లేంటి? - మాజీ ఎంపీపీ జక్కా అశోక్‌ను ఏ-1గా చేర్చడంలో కుట్రదారులెవరు
- ఈ అక్రమ కేసు వెనుక దాగి ఉన్న రాజకీయ పెద్దలు ఎవరు?




చెన్నారావుపేట మార్చి 28 (ప్రజా జ్యోతి) న్యాయం చేయాల్సిన రక్షక భటులే భక్షకులుగా మారుతున్నారా? అమాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం పావులుగా వాడుకుంటున్నారా? అంటే అవుననే అంటున్నారు మండల ప్రజలు జల్లి గ్రామస్తులు దొంతర బోయిన కొమ్మాలు మరియు ఆయన కుమారులపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఇప్పుడు మండలంలో తీవ్ర దుమారం రేపుతోంది. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించడం ఉద్రిక్తతకు దారితీసింది. అసలేం జరిగింది?జల్లి గ్రామానికి చెందిన దొంతర బోయిన కొమ్మాలు, ఆయన కుమారులను పోలీసులు అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ అరెస్టుల వెనుక రాజకీయ పలుకుబడితో పోలీసుల హస్తం ఉందని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యాలు సృష్టించి వారిని ఇరికించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వారే తప్పుడు మార్గాల్లో వెళ్లడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

**సినిమాల్లో లేని పాత్రకు 'మెయిన్ విలన్' రోల్?**

ఈ ఉదంతంలో అసలైన ట్విస్ట్ ఏమిటంటే.. మాజీ ఎంపీపీ జక్కా అశోక్ వ్యవహారం. సదరు ఘటనతో కానీ, ధర్నాతో కానీ అశోక్‌కు ఎటువంటి సంబంధం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఆయన ఘటనా స్థలంలో లేకపోయినప్పటికీ, కేవలం రాజకీయ ప్రాధాన్యంతోనే పోలీసులు ఆయనను ఈ కేసులో ఏ–1 గా చేర్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సినిమా స్క్రిప్టును తలపించేలా తెరపై లేని వ్యక్తిని ప్రధాన నిందితుడిగా చూపించడం వెనుక ఉన్న మర్మమేమిటని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.చట్టం ఎవరికీ చుట్టం కాదనేది నానుడి..కానీ ఇక్కడ చట్టం రాజకీయాలకు చుట్టంగా మారిందా? అనే అనుమానం కలుగుతోంది!

**ఉన్నతాధికారుల విచారణ కోరుతున్న ప్రజలు**

పోలీసులు పూర్తి ఆధారాలతోనే జక్కా అశోక్‌పై కేసు నమోదు చేశారా? లేక పైస్థాయి ఒత్తిళ్లకు తలొగ్గి ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా? అనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. న్యాయం బ్రతికి ఉందా లేక రాజకీయాలకు లొంగిపోయిందా అని మండల వ్యాప్తంగా ప్రజలు చెవులు కొరుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలైన దోషులపై చర్యలు తీసుకోవాలని, రాజకీయ కక్షసాధింపు చర్యలను ఆపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- అఖిల భారత ప్రగతిశీల ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిర్ర సూరి.



**వర్ధన్నపేట, మార్చి 28, ప్రజా జ్యోతి.** బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవు ల పోరాట స్ఫూర్తి భారత ప్రజలకు ఆదర్శనీయమని, వారి పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత విద్య, ఉద్యోగ ,ఉపాధి అవకాశాల కోసం సంఘటితంగా పోరాడాలని అఖిలభారత ప్రగతిశీల ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు.శనివారం వర్ధన్నపేట మండల కేంద్రంలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ వీరులు షాహిద్ భగత్ సింగ్ , రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95 వ వర్ధంతి స్మారక వారోత్సవాల (మార్చి 23 నుండి 30 వరకు) సందర్భంగా వారి చిత్రపటానికి పూలు వేసి, ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పార్లమెంట్ అసెంబ్లీ లాంటి చట్టసభలలో స్వదేశీ ,విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారుల ఆర్థిక ప్రయోజనాలే ధ్యేయంగా సంస్కరణలు, చట్టాలు తీసుకువస్తూ, దేశంలోని ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారి దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నాడని మండిపడ్డారు. నాడు ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని దోచుకుంటే,స్వదేశీ పాలనలో నేడు వందలాది మల్టీ నేషనల్ కంపెనీల ఆర్థిక దోపిడికి ప్రధాన కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలంతా కుల ,మత, ఆర్థిక అసమానతలు లేని సంపూర్ణ సమానత్వ దేశ నిర్మాణానికి షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట పూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. దర్గయ్య, మాస్ లైన్ పార్టీ నాయకులు మల్లయ్య,కుమార్,ఎల్లయ్య, యాకుబ్,కిషన్, సుమన్,సంపత్ పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే నాపై అక్రమ కేసులు

- మాజీ ఎంపీపీ జక్క అశోక్ ఆగ్రహం
- సూదిని అజయ్ రెడ్డి పెత్తనం కోసం కుట్రలు.



చెన్నారావుపేట మార్చి 28 (ప్రజా జ్యోతి) రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెన్నారావుపేట మాజీ ఎంపీపీ జక్క అశోక్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరెడ్డి వద్ద అనుచరుడిగా చలామణి అవుతున్న సూదిని అజయ్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం మండలంలో చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు.మండలంలోని కాంట్రాక్టు పనుల్లో తన పెత్తనం సాగించేందుకు తన వర్గం వారిని పెద్ద నాయకులుగా చూపించుకునేందుకు అజయ్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అశోక్ విమర్శించారు. ఇందులో భాగంగానే తన సామాజిక వర్గానికి చెందిన ఏసీపీ రవీందర్ రెడ్డి ఎస్సై రాజేష్ రెడ్డిలపై ఒత్తిడి తెచ్చి ఒక నాయకుడినైన తనపై అక్రమంగా కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే?** నెల రోజుల క్రితం జల్లి గ్రామంలో కేవలం 'క్వార్టర్ మందు' కోసం జరిగిన చిన్నపాటి గొడవను అడ్డుపెట్టుకొని తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని అశోక్ పేర్కొన్నారు. గొడవ జరిగిన రోజు గానీ విచారణ జరిగిన రోజు గానీ నేను ఊర్లో లేను. బాధితులు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపిన సమయంలోనూ నేను మండల పరిధిలో లేను. కనీసం సంబంధం లేని నన్ను రాజకీయంగా తొక్కేయాలనే కుట్రతోనే ఈ కేసుల్లో చేర్చారు అని ఆయన స్పష్టం చేశారు.సూదిని అజయ్ రెడ్డి తన అక్రమ సంపాదన కోసం ఎమ్మెల్యే మాధవరెడ్డి వద్ద ఎవరినైనా దొంగలుగా చిత్రీకరిస్తారని చివరికి సొంత అన్నదమ్ములను కూడా దూరం చేయగల దుర్మార్గుడని ఘాటుగా విమర్శించారు. జల్లి గ్రామంలో భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా దానికి అజయ్ రెడ్డే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ విషయంలో ఏసీపీ గారు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అక్రమ కేసు నుండి తన పేరును తొలగించాలని డిమాండ్ చేశారు.

## హరి సంపత్ శర్మ కుటుంబానికి పరామర్శ



**గణపురం ప్రజాజ్యోతి మర్చి 28** ఇటీవల హన్మకొండలో మృతిచెందిన చెల్పూర్ గ్రామ నివాసి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పురోహితుడు హరి సంపత్ శర్మ కుటుంబాన్ని గ్రామ పెద్దలు పరామర్శించారు.ఈ సందర్భంగా చెల్పూర్ గ్రామ సర్పంచ్ కావటి రజిత రవీందర్, మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోట కుమార్, దారకొండ నాగరాజు, పెరుక మనోహర్ తదితరులు హరి సంపత్ శర్మ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఈ కష్టకాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

## 30 న అంగడి వేలం పాట

**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 28)** మండలంలోని మొట్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతి శనివారం నిర్వహించే కూరగాయలు అంగడిని ఈ నెల 30 న గ్రామపంచాయతీ ఆవరణలో 11.00 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి,కార్యదర్శి సుజాత తెలిపారు.వేలం పాటలో పాల్గొనే వారు 5000/డిపాజిట్ గా గ్రామపంచాయతీలో చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు.

## గ్రామాల్లో ప్రతి నెల 30న పౌర హక్కుల దినోత్సవం జరపాలని వినతి



**గణపురం ప్రజాజ్యోతి మర్చి 28**గణపురం మండలంలో గ్రామాల స్థాయిలో ప్రతి నెల 30వ తేదీన “పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి కి శనివారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ప్రకారం దేశవ్యాప్తంగా ఇంకా కొనసాగుతున్న అంటరానితనం, అస్పృశ్యత, కుల వ్యవస్థ, మూఢనమ్మకాలపై అవగాహన పెంచడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల 30న గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ పాలకవర్గం, సర్పంచ్, వార్డు సభ్యులు, కుల, మత భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా చూడాలని సూచించారు. అదేవిధంగా దళితవాడల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి సామాజిక సమానత్వాన్ని పెంపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జాతీయ కార్యదర్శి ఎండి సైదులు భాషతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

## భారత సైనిక విభాగంలో అగ్నివీర్ గా చేరేందుకు పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా యువజన, క్రీడల అధికారి : కే. కోదండ రాములు



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 28 (ప్రజాజ్యోతి) :** భారత ప్రభుత్వం, అగ్నిపథ్ పతకంలో భాగంగా భారత సైనిక విభాగంలో అగ్నివీర్ గా చేరేందుకు గాను పురుష అభ్యర్థుల నుంచి 2027 సంవత్సరానికి గాను దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కే. కోదండ రాములు తెలి పారు. వివాహం కాని పురుష అభ్యర్థులకు మాత్రమే అర్హులని, అలాగే 8వ తరగతి ఆ పైన చదివిన వారు, 01జులై.2005 నుంచి 01జులై. 2009 మధ్యలో జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అర్హత కలిగిన జిల్లాలోని యువకులు ఏప్రిల్ ఒకటవ తేదీ లోపు (www.joinindianarmy.nic.in) వెబ్ సైట్ ద్వారా వివరముల కొరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ ఉడుత సాంబయ్య యాదవ్



**గణపురం ప్రజాజ్యోతి మార్చి 28** గణపురం మండలంలోని పరశురాంపల్లి గ్రామానికి చెందిన పెంట సుమన్, శ్రావణి దంపతుల కుమారుడు పెంట వేదాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుకల్లో పరశురాంపల్లి సర్పంచ్ ఉడుత సాంబయ్య యాదవ్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, చెన్నబోయిన రాజు, చెన్నబోయిన దేవేందర్, అనుమాండ్ల రాజు, పెంట సురేష్, ఎర్రం సదానందం తదితరులు పాల్గొన్నారు

## ముమ్మరంగా డ్రైనేజీల శుభ్రత

- ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యం సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి.

**చెన్నారావుపేట మార్చి 28 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రమైన చెన్నారావుపేట గ్రామంలో పారిశుధ్య మెరుగుదలే ధ్యేయంగా సైడ్ డ్రైనేజీల శుభ్రత కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితో కలిసి డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.వ్యాధుల నివారణకే ప్రాధాన్యం . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా మురుగునీరు నిలిచిపోకుండా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తుగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కాలువలతో పాటు అంతర్గత డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దుర్వాసన అంటువ్యాధుల నుండి ప్రజలను రక్షించవచ్చని పేర్కొన్నారు. చెన్నారావుపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ప్రజల భాగస్వామ్యం అవసరంగ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా పంచాయతీ ట్రాక్టర్లకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంతి



శ్రీనివాస్, మాజీ సర్పంచ్ హంస విజయరామ రాజు, మండల నాయకులు మహేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు రాజిత సతీష్,రాధిక రాజు, అజ్మీర భారతి రాజు, కంకల అశ్విని రాజు, ఎల్ల గౌడ్, భావాని సురేందర్,అశోక్, శ్రీకాంత్, వంశీ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి అంగన్వాడీలు కీలకం



**వర్ధన్నపేట, మార్చి 28, ప్రజా జ్యోతి:** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సత్యాశారదా ఆదేశాల మేరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కి వచ్చే పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ప్రతి అంగన్వాడీ సెంటర్ కృషి చెయ్యాలని ఆరోగ్య పోషన్ పథకం ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందించే వివిధ సేవలు, పథకాల గురించి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ సేవల గురించి, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన టీచర్లు మంచి విద్యను అందిస్తున్నారని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా తల్లిదండ్రులు ముందుకు రావాలని తెలియజేశారు.పోషకాహార అభియాన్ అందిస్తున్న పోషకాలతో కూడిన ఫుడ్ ని పిల్లలకు అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యూ.ఓ రాజమణి,సి.డి.పి.ఓ డెబోర,ఐసీడీసీ సూపర్వజర్స్ చంద్రకళ,లలిత,మాధవి లత,రేవతి,మౌనిక, ఎంపిడిఓ వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు ,రంగయ్య,కృష్ణ, గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, ఉప సర్పంచ్ బొచ్చు జ్యోతి,అంగన్వాడీలు బేతి మాధవి,మల్లెపాక భాగ్యలక్ష్మి,నేరెల్లి భారతి,హెల్పర్స్ కవిత,సుజాత,జయ,విమల,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యు టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు

- బాలికల భద్రతకు పోలీసుల ప్రత్యేక నిఘా
- పరీక్షా కేంద్రాల వద్ద వేధింపులకు చెక్
- విద్యార్థినుల రక్షణకు పోలీసు శాఖ చర్యలు
- అల్లరి మూకలపై ఉక్కు పాదం మోపుతాం
- టేకుమట్ల ఎస్ఐ గైక వాడ అమూల్య
- పరీక్షా కేంద్రాల వద్ద మఫ్టీలో విద్యార్థినిలతో మమేకం



**టేకుమట్ల ప్రజాజ్యోతి మర్చి 28** ఈ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పరీక్షా కేంద్రాల వద్ద బాలికల భద్రతకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టేకుమట్ల ఎస్ఐ గైకవాడ అమూల్య తెలిపారు. శనివారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద బాలికలపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు టేకుమట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ చర్యలు అమలు చేశారు. ఈవ్ టీజింగ్‌ను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో టేకుమట్ల ఎస్ఐ అమూల్య సాధారణ మహిళ వేషధారణలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో కలిసి పరిస్థితులను నిశితంగా గమనించారు.పరీక్షా కేంద్రం పరిసరాల్లో అల్లరి చేసే యువకులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. బాలికలు నిర్భయంగా పరీక్షలు రాసేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేలా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై అమూల్య మాట్లాడుతూ, విద్యార్థినుల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వేధింపులు, అనుచిత ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు ధైర్యంగా పరీక్షలు రాయాలని అమూల్య సూచించారు.